
టైగర్ మున్నా
ONE WAY
MVS
PUBLICATIONS
మధుబాబు

# టైగర్ మున్నా

(ఎ షాడో ఎడ్వెంచర్)

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# ముందు మాట

షాడో సి.ఐ.బి. నెంబర్ వన్ ఏజెంట్‌గా ఎన్నుకోబడటానికి కారణభూతమైనది అతని గత జీవితం. దిన దిన గండం నూరేళ్ళ ఆయుష్షు అనే మాటను నిజం చేస్తూ ప్రతిక్షణం, ప్రతి నిముషం, ఏదో ఒక ప్రమాదాన్ని ఎదుర్కొంటూ గడిపినవాడు షాడో. సి.ఐ.బి. ఏజెంట్లకు కావాల్సిన తెంపరితనం, సమయ స్ఫూర్తి అతనికి పోలీసులతో పరుగు పందేలు వేసి, ప్రాణాలు కాపాడుకోవటానికి విపరీతమైన శ్రమ పడటం వల్ల లభించాయి.

అయితే సి.ఐ.బి. ఏజెంట్లకు అనవసరమైన గుణాలు కూడా కొన్ని షాడో వున్నాయి. నోరు తెరిచి సహాయం అడిగితే కాదని అనలేక పోవటం వాటిలో మొదటిది. తనకు అవసరమైన విషయాల్లో తలదూర్చి ప్రాణాల మీదికి తెచ్చుకోవటం రెండవది.

సులేమాన్ పాదుకలకోసం పాకిస్థాన్ పోవాల్సిన అవసరం అతనికి లేదు. అసలు పాకిస్థాన్ ప్రజల మీద, ప్రభుత్వం మీద అతనికి సదభిప్రాయం కూడా లేదు. అయినా తన స్నేహితుడు ఠాకూర్ రాంచంద్ మాటను కాదనలేక అక్కడికి పోయాడు. పోయిన వాడు ఆ పాదుకల్ని వశపరుచుకోవటంతో ఆగకుండా దేర్వార్ కోటను ధ్వంసంచేసి రన్నింగ్ ప్రారంభించాడు.

బంగారం వంటి తమ ప్రధాన మిలటరీ స్థావరం దగ్ధం అయితే పాకిస్థాన్ ప్రభుత్వం చూస్తూ వూరుకుంటుందా? అతని అంతు చూడమని సైనిక దళాలను

వెంట తరిమింది. అది చాలదన్నట్లు అతని తల మీద పెద్ద బహుమతిని కూడా ప్రకటించింది.

సరిహద్దుల్ని దాటి భారత భూభాగంలోకి రాలేకపోయాడు షాడో. వచ్చిన మరుక్షణం చుట్టుముట్టటానికి సరిహద్దు పొడుగునా మాటు వేసి వున్నారు స్పెషల్ బ్రాంచి సి.ఐ.డిలు. పాకిస్థాన్ భూభాగంలో తల దాచుకునే అవకాశం కూడా అతనికి లభించలేదు. భారతీయుడనే కక్షను మనస్సులో పెట్టుకొని, ప్రభుత్వం ఎనౌన్స్ చేసిన బహుమతిని గురించి కలలు కంటూ మిలటరీ దళాలకు హెల్ప్ చేసి అతన్ని మట్టు పెట్టించే ప్రయత్నాలు చేశారు పాకిస్థాన్ ప్రజలు.

అడకత్తెరలో పోక చెక్క మాదిరి తయారయింది షాడో పరిస్థితి. చుట్టుముట్టిన ప్రమాదాలను గమనించేసరికి ఒక విధమైన వైరాగ్యం అతని మనస్సును ఆవరించుకొంది. ఏదో ఒక మూలకు పోయి ఎటువంటి గొడవా లేకుండా జీవిద్దామనే కోరిక అతని హృదయంలో అడుగు పెట్టింది. ముక్కుకు సూటిగా ప్రయాణించి సముద్ర తీరంలో వున్న ఒక రేవు పట్టణాన్ని చేరుకున్నాడు. సరిగ్గా అదే రోజున లంగర్ ఎత్తి కదలటానికి సిద్ధంగా వున్నది ఒక స్టీమర్. కరాచీ నుంచి బయలు దేరింది అది. లక్షదీవుల మీదుగా సిలోన్ పోతున్నది.

వెనుకా ముందు ఆలోచించకుండా దాన్ని కాచ్ చేశాడు షాడో. లక్ష దీవులకు పోయి పోలీసులకు స్లిప్ ఇచ్చేద్దామని అభిప్రాయపడ్డాడు.

తానొకటి తలిస్తే దైవం మరొకటి తలుస్తుందన్న సామెత నవ్వులాటకు చెప్పింది కాదు. తమ అనుభవాల నన్నిటినీ జోడించి పురాతన కాలపు పెద్దలు

కనుగొన్న నగ్నసత్యం అది. షాడో విషయంలో అది నూటికి నూరుపాళ్ళు యదార్థం అయింది.

పాకిస్థాన్ మిలటరీ షాడోని పట్టుకోలేక పోయిందనే వార్తను వినగానే భారతీయ రేవు పట్టణాలన్నిటినీ సి.ఐ.డిలతో నింపి వేశాడు ఫెర్నాండజ్. షాడో ఎక్కిన స్టీమర్ పాంజిమ్ రేవుకు పాతిక మైళ్ళ దూరంలోకి రాగానే తన అనుచరులను పంపి దాన్ని అడ్డగించాడు.

అంత వరకూ స్పెషల్ బ్రాంచిని ముప్పుతిప్పలు పెట్టిన షాడో యీ సారి పట్టుబడకుండా వుండటం ఆసంభవం అనే అభిప్రాయం అందరి మనస్సులలోను దృఢంగా ప్రవేశించింది. అతను పట్టుబడ్డాడనే వార్తను వినటానికి ఆతృతగా ఎదురుచూడటం ప్రారంభించారు స్పెషల్ బ్రాంచి వున్నాతాధికారులు.

ఫెర్నాండజ్ అనుచరులు స్టీమర్‌ని చెక్ చేయటం ప్రారంభించిన మరుక్షణం అన్నిటికీ తెగించి సముద్రం లోకి జంప్ చేశాడు షాడో. స్టీమర్ ప్రక్కగా వ్రేలాడుతున్న లైఫ్ బోటును నీటిలోకి వదిలి దానిమీద అతన్ని అనుసరించాడు గంగారాం. జరిగిన విషయాన్ని ఫెర్నాండజ్ అనుచరులు గమనించేసరికి స్టీమర్‌ని వదిలి చాలా దూరం వెళ్ళిపోయారు వారిద్దరూ.

ఇక్కడి నుంచీ ప్రారంభం అవుతుంది యీ షాడో ఎడ్వెంచర్. ఇక చదవండి......

# 1

నిలువెత్తున ఎగిసి పడింది ఒక అల. దానితో పాటు నిట్ట నిలువుగా పైకి లేచి ధబ్ మని శబ్దం చేస్తూ నీటి మీదికి వాలింది లైఫ్ బోటు. చుక్కానీ ముందు కూర్చుని వున్న గంగారాం తల్లక్రిందులుగా పల్టీకొట్టి సముద్రంలో పడ్డాడు.

అలా పడటమే అతన్ని ప్రాణాల్ని రక్షించింది. అంత వరకూ అతను కూర్చుని వున్న ప్రదేశంలో వాలి చెవులు చిల్లులు పడే శబ్దంతో ప్రేలిపోయింది ఒక రాకెట్.

కత్తితో నరికినట్లు రెండుగా చీలి సముద్ర గర్భంలోకి వెళ్ళిపోయింది లైఫ్ బోటు. ఆ అదటుకు దాని ముందుభాగాన్ని పట్టుకొని వ్రేలాడుతున్న షాడో తల్లక్రిందులుగా గాలిలోకి ఎగిరి గంగారాం ప్రక్కనే పడ్డాడు.

"దొంగ నాయాళ్ళు మనల్ని కనిపెట్టేశారు గురో! ఆ ఫెర్నాండజ్ అంతు చూడకపోతే యిక లాభం లేదు." నిముషానికి రెండుసార్లు నీటిలో మునకలు వేస్తూ వాపోయాడు గంగారాం.

ముఖం మీదికి వాలిన జుట్టునను వెనక్కి విదిలించుకుంటూ కనులు చిట్లించి ముందుకు చూశాడు షాడో.

పడమటి దిక్కును అలంకరించి వున్నాడు సూర్యుడు. సింధూరం కలిపినట్లు ఎర్రటి రంగులతో నిండివుంది సముద్రం. ఆ రంగుల్ని చెల్లా చెదురు చేస్తూ శరవేగంతో వారి వైపు దూసుకు వస్తోంది ఫెర్నాండజ్ అనుచరులు ఎక్కిన మోటార్ బోటు.

"గంగూ! చీకటి పడేదాకా మనం వీళ్ళని ఏమార్చగలిగితే చాలు. చీకటి పడిన తరువాత వీళ్లు చేయగలిగింది ఏమీలేదు. బీ కేర్ ఫుల్." అంటూ చటుక్కున నీటిలోకి మునిగాడు.

ఆకాశం వైపు చూసి చేతులు జోడించాడు గంగారాం.

"అమ్మా కలకత్తా కాళీ..... గుంటనక్క ఫెర్నాండజ్ మా కొంపలు కూల్చటానికి ప్రయత్నిస్తున్నాడు. అతని గొంతు పిసికి సముద్రంలో పడేదాకా నాకు ఆయుష్షను ప్రసాదించు. నీకు రెండు పాంజిమ్ పందేపు కోళ్ళను బలి యిస్తాను." అంటూ గుండెల నిండుగా గాలి పీల్చుకొని షాడోని అనుసరించాడు.

పది నిముషాల తర్వాత ఆ ప్రదేశాన్ని సమీపించింది మోటారు బోటు. రాకెట్లను విసిరే బజూకాలను, హై పవర్ రైఫిల్స్‌నీ రెడీగా పట్టుకొని సముద్రాన్నంతా జాగ్రత్తగా పరిశీలించటం ప్రారంభించారు ఫెర్నాండజ్ అనుచరులు.

ఉన్నట్లుండి రెండు వందల గజాల దూరంలో వారికి కనిపించాడు షాడో.

" అడుగో....అడుగడుగో....." బిగ్గరిగా అరిచాడు ఒక సి.ఐ.డి.

పొగల్ని విడుస్తూ గాలిలోకి లేచింది బజూకా వదిలిన పోర్టబుల్ రాకెట్. ఏటవాలుగా పోయి షాడోకి పది అడుగుల దూరంలో పడి దిక్కులు దద్దరిల్లేటట్లు ప్రేలింది.

ఊపిరి ఆగిపోయినట్లు బాధ పడుతూ అలల మీదుగా లేచి అవతల పడ్డాడు షాడో. సి.ఐ.డిలు తిరిగి ఎయిమ్ తీసుకోకముందే నీటిలో మునిగి అదృశ్యం అయ్యాడు.

"పోనీయండి......బోటును ముందుకు పోనీయండి...... యింకొక్క రాకెట్‌తో షాడో పని ఖతం అయిపోవాలి...." ఖంగుమంటున్న కంఠంతో ఆర్డర్ యిచ్చాడు ఒక సి.ఐ.డి. విమానం మాదిరి మ్రోతలు చేస్తూ ముందుకు దూకింది మోటార్ బోటు.

అప్పుడే నీటి మీదికి తేలుతున్నాడు గంగారాం. సముద్ర భూతంలా దూసుకువస్తున్న ఆ బోటును చూసి ఖంగారుగా వెనక్కి జరగబోయాడు.

"అదుగో....అదుగో....." ఆకాశం పగిలి పోయేటట్లు అరిచాడు ఒక సి.ఐ.డి.

ధనాధన్ ధనాధన్‌మని గర్జించాయి నాలుగు రైఫిల్స్. కందిరీగల్లా రొదచేస్తూ గంగారాం తల చుట్టూ పడ్డాయి వాటి బుల్లెట్లు.

అదిరిపడి నీటిలోకి డైవ్ చేశాడు గంగారాం. ఓపిక వున్నంతవరకూ సముద్ర గర్భంలోనే తల దాచుకున్నాడు. రెండు నిముషాలు కూడా గడవక ముందే మంటలు పెట్టటం ప్రారంభించాయి అతని గుండెలు. పైకి తేలకపోతే ప్రాణాలు దక్కవేమో అన్నంత బాధ అతన్ని ఆవరించుకుంది. మండుతున్న గుండెల్ని చిక్క బట్టుకొని మెల్లిగా పైకి వచ్చాడు.

ఖంగుమని శబ్దం చేస్తూ అతని తలకు తగిలింది పెద్ద చెక్క పలక. కళ్ళ ముందు నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా ప్రక్కకు జరిగే ప్రయత్నం చేశాడు. పది అడుగుల దూరం పోయిన తర్వాత గాని పైకి రావటం చేతకాలేదు. పైకి వచ్చి చూసేసరికి సరిగ్గా పది అంగుళాల దూరంలో అతనికి కనిపించింది మోటార్ బోటు వెనుకభాగం.

ఆనందంతో వుక్కిరి బిక్కిరి అయ్యాడు గంగారాం. పెద్దగా అరిచి అందర్నీ వెక్కిరించాలన్న కోరిక అతని హృదయంలో అడుగు పెట్టింది. గబగబా ఫాంటు జేబుల్ని తడుముకొని ఎనిమిది అంగుళాల పొడవున్న పఠాన్ పేష్కవ్‌ని బయటికి తీశాడు.

పాకిస్థాన్‌లో తయారు చేయబడిందా పేష్కవ్. వేలితో మీటితే వేలు తెగి, రెండు ముక్కలు అయ్యేటంత పదును మీద వుంది.

దాన్ని ఎడమ చేతిలో బిగించి పట్టుకొని బోటు క్రింది భాగంలో ఎడ్జస్టుమెంట్ ప్రారంభించాడతను. బోటు మీద వున్నవారికి అతను చేస్తున్నపని అంతు బట్టలేదు. కనపడినట్టే కనపడి వెంటనే మాయం అవుతున్న షాడో మీద కేంద్రీకరించి వున్నాయి వారి చూపులు. గంగారాం కొడుతున్న పేష్కవ్ దెబ్బల్ని మోటర్ బోటు యింజన్ మ్రింగేస్తున్నది.

పట్టిన పట్టు వదలకుండా పది నిముషాల పాటు శ్రమ పడ్డాడు గంగారాం. ఉన్నట్లుండి బోటు క్రిందిభాగంలో ప్రత్యక్షం అయింది నాలుగు అంగుళాల వెడల్పున్న రంధ్రం.

పట్టరాని సంతోషంతో పరవశించి పోతూ ఆ రంధ్రాన్ని మరింత వెడల్పు చేశాడు గంగారాం. శరవేగంతో బోటు లోకి పోతున్న సముద్రపు నీటిని చూసి నిశబ్దంగా నవ్వాడు.

అంగుళం అంగుళం చొప్పున నీటిలోకి క్రుంగటం ప్రారంభించింది మోటార్ బోటు. షాడోని ట్రేస్ చేయటంలో బిజీగా వున్న ఫెర్నాండజ్ అనుచరులకు యింకా అర్థం కాలేదు ఆ విషయం.

"తరమండి బే.....యింకెంత సేపు మమ్మల్ని తరుముతారో నేనూ చూస్తాను." అనుకుంటూ పేష్కప్‌ని పాంటు జేబులో పెట్టుకొని, షాడోని వెతుకుతూ బయలు దేరాడు గంగారాం.

రెండు నిముషాల తరువాత అతనికి కనిపించాడు షాడో. సి.ఐ.డి.లు విసురుతున్న రాకెట్లకు, బుల్లెట్లకు అందకుండా విపరీతమైన శ్రమ పడుతున్నాడు.

"మరేం పరవాలేదు గురూ.... వీళ్ళ పని అయిపోయింది. ఇక మనల్ని ఏమీ చేయలేరు యీ దొంగనాయాళ్ళు...." అంటూ అతని ప్రక్కన తేలి అభయం యిచ్చాడు గంగారాం. అదే సమయంలో అతనికి దగ్గిరిగా పడి ఢామ్మని ప్రేలింది రాకెట్ ఒకటి.

గిల గిలా కొట్టుకుంటూ గాలిలోకి ఎగిరి షాడో మీద పడ్డాడు గంగారాం.

"మైగాడ్! గంగూ!! ఏమయింది?" అతన్ని ఎడమ చేత్తో పట్టుకొని ముఖంలోకి చూస్తూ ఆందోళనగా అడిగాడు షాడో.

"ముందు ఆ బోటు అక్కడి నుంచి వెళ్ళిపోయిందో లేదో చూడు గురూ?......." హీనస్వరంతో అన్నాడు గంగారాం.

"రాకెట్ దెబ్బకు నీకు మతిపోయింది. బోటు వెళ్ళి పోవటం ఏమిటి నా ముఖం....." అనుకుంటూ ముందుకు చూసి ఆశ్చర్యంతో ప్రమాన్పడిపోయాడు షాడో.

వారిని హతమార్చే ఆలోచనను విరమించుకొని వేగంగా తీరం వైపు వెళ్ళిపోతున్నది మోటార్ బోటు. క్రింది భాగంలో రంధ్రం పడినట్లు నీటిలోకి క్రుంగి పోతున్నది.....

"వాటీజ్ దట్! ఆ బోటుకు ఏమయింది??" అయోమయంగా అడిగాడు షాడో.

"తన భక్తుణ్ణి హింసిస్తుంటే కలకత్తా కాళి వూరుకుంటుందా? బోటు క్రింద బొక్క పెట్టే వుందుంది." ఏమీ తెలియనట్లు అమాయకంగా అన్నాడు గంగారాం.

తన కళ్ళను తనే నమ్మలేక విచిత్రంగా చూశాడు షాడో. ఫెర్నాండజ్ అనుచరుల బారి నుంచి అంత తేలికగా బయట పడటం జరుగుతుందని అతను వూహించలేదు.

చూస్తుండగానే దూరంగా పోయి దృష్టిపథం నుంచి మాయం అయింది ఆ మోటారు బోటు. వెంటనే ప్రక్కకు తిరిగి తీరం వైపు యీదటం ప్రారంభించాడు షాడో. ఐదు నిముషాలకు ఒకసారి అతన్ని కొంచెం ఆగమని గోల చేస్తూ అనుసరించాడు గంగారాం. నాలుగు గంటల తరువాత వారి కనుల ముందు ప్రత్యక్షం అయింది పాంజిమ్ పట్టణం.

## 2

"రోషం, అభిమానం అనేవి అసలు మీకు వున్నాయా? చేతికి చిక్కిన మనిషిని చేజార్చుకున్నామని చెప్పటానికి మీకు సిగ్గు వేయటం లేదూ?" ఎర్రబడిన ముఖంతో ఆవేశంగా అడిగాడు స్పెషల్ బ్రాంచి డైరెక్టర్.

అవమానాగ్ని జ్వాలల్లో దహించుకుపోతూ తలదించుకున్నాడు ఫెర్నాండజ్. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ మౌనంగా నిలబడ్డారు అతని అనుచరులు.

"దిసీజ్ టూ మచ్ మిస్టర్ ఫెర్నాండజ్! ఇన్నిసార్లు కర్తవ్య నిర్వహణలో ఫెయిల్ అవటాన్ని స్పెషల్ బ్రాంచి సహించదు. నెల రోజుల్లోపల షాడోని వురికంబాననికో, వల్లకాటికో పంపించకపోతే, మీ వుద్యోగాలను మరొకరికి ఎలాట్ చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది." అంటూ గిరుక్కున వెనుతిరిగి జీప్ ఎక్కాడు స్పెషల్ బ్రాంచి డైరక్టర్.

శిలా విగ్రహంలా నిలబడి పోయాడు ఫెర్నాండజ్. అతని కనుల ముందే దుమ్ము తెరలను రేపుతూ అవతలికి వెళ్ళిపోయింది ఆ జీప్.

"పాంజిమ్ పట్టణాన్నంతా కవర్ చేశాం సర్. సిటీ పోలీసుల సహాయంతో వీధులన్నిటినీ గాలిస్తున్నాం." నేల చూపులు చూస్తూ ఫెర్నాండజ్‌కి రిపోర్టు చేశాడు ఒక సి.ఐ.డి.

గాఢంగా నిట్టూర్చి అతని భుజం తట్టాడు ఫెర్నాండజ్. కోటు జేబులో నుంచి రెండు నోట్ల కట్టల్ని తీసి అతని చేతిలో పెట్టాడు.

"వీధుల్లో తిరిగే రౌడీలకు, బిచ్చగాళ్ళు, మురికివాడ పౌరులకు యీ డబ్బును పంచి పెట్టండి. వాళ్ల సహాయంతో షాడోని ట్రేస్ చేయాలి. ఈసారి అతన్ని పట్టుకోలేకపోతే మన వుద్యోగాలు మనకి దక్కవన్న మాటను మాత్రం మరిచిపోకండి" అని హెచ్చరించాడు.

స్టిఫ్‌గా శాల్యూట్ చేసి తలా ఒక మూలకు పరుగులు తీశారు వారందరూ. రెండు నిముషాల పాటు అక్కడే నిలబడి మెల్లిగా తన జీప్ వైపు అడుగులు వేశాడు ఫెర్నాండజ్. అంతలోనే అతని దృష్టిని ఆకర్షించింది ఒక దృశ్యం.

రోడ్డుకు ఆవలిప్రక్కన నిలబడి వుంది పెద్ద మర్రిచెట్టు ఒకటి. దాని కొమ్మల మీద కూర్చుని కునికిపాట్లు పడుతున్న కాకులన్నీ కర్ణకఠోరంగా అరుస్తూ గాలిలోకి లేస్తున్నాయి.

అప్రయత్నంగా తన రివాల్వర్‌ని బయటికి లాగి అటు వైపు అడుగులు వేయబోయాడు ఫెర్నాండజ్.

"వాటికి వేరే పని ఏమీ లేదు సార్.... మనల్ని చూసి బెదిరినట్లున్నాయి....." నవ్వుతూ కామెంట్ చేసాడు జీప్ దగ్గిర నిలబడి వున్న అతని డ్రయివర్.

రెక్కలు తపతప కొడుతూ చెట్టు చుట్టూ రౌండ్స్ వేస్తున్న కాకుల్ని మరింత పరిశీలనగా చూశాడు ఫెర్నాండజ్. చీకటితో నిండి వున్న చెట్టుకొమ్మల్ని కూడా పట్టి పట్టి గమనించాడు. డ్రయివర్ అన్న మాటలో అసత్యం ఏమీ లేదని అనిపించింది కాబోలు గిరుక్కున వెను తిరిగి జీప్‌లో కూర్చున్నాడు.

అది ఆ వీధి చివరికి వెళ్ళిపోయేదాకా ఆగి, మర్రిచెట్టు కొమ్మల్లో నుంచి క్రిందికి దూకాడు షాడో. దిగలేక దిగలేక దిగుతున్న గంగారాంని చేతికి అందించి సహాయం చేశాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2320**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**